కెరటం
మంగళవారం 20, ఆగస్ట్ 2024

వనం నాగయ్య, కెరటం న్యూస్:

**నిలకడగా విజయాలు సాధించడం..** అంచెలంచెలుగా తన సంస్థను విస్తరించడం.. అందరికన్నా ముందు నిలిచి అభినందనలు అందుకోవడం అనుకున్నంత సులువుకాదు. అందుకు ఎంతో క్రమశిక్షణ కావాలి. ప్రతిభా పాటవాలు తోడు కావాలి. ఈ క్రమంలో ఆటు పోట్లను తట్టుకునే మానసిక సంకల్పం మరింత కావాలి... ఈ లక్షణాలు అన్నీ కలగలిస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. మరి జీవితంలో ఇవన్నీ సాధిస్తే ఆ కిక్కే వేరు. జీవిత పరమార్థానికి ఇంతకన్నా మరేం కావాలి. అత్యంత సాధారణ కుటుంబంలో పుట్టి దినసరి కూలీగా సెక్యూరిటీ గార్డుగా పనిచేసి అదే సంస్థను నెలకొల్పి నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో వందలాది మంది సెక్యూరిటీ గార్డుల కుటుంబాలకు పెద్ద దిక్కుగా అవతరించేలా కఠోర తపస్సులా మొక్కవోని దీక్షతో విజయం సాధిస్తే... అవును ఇవన్నీ సాధించిన వ్యక్తి గురించే ఈ రోజు మనం తెలుసుకోబోతున్నాం.. ఇంతకూ అతనెవరనేగా మీ సందేహం. ఖమ్మం జిల్లా వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన దుగ్గిరాల రామకృష్ణ. ఒకప్పుడు సెక్యూరిటీ గార్డుగా ఏటీఎంల ముందు గంటల తరబడి నిలబడిన వ్యక్తే నేడు రెండు తెలుగురాష్ట్రాల్లో ఒక ప్రభంజనం సృష్టించాడు. అందుకే ఆయన ప్రస్థానం ఒక విలువైన పాఠం అని చెప్పక తప్పదు. దుగ్గిరాల రామకృష్ణ యూత్ ఐకాన్‌గా గుర్తింపు పొంది తన ప్రస్థానంలో సాధించిన విజయం గురించి **కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం...**



# సెక్యూరిటీ సామ్రాట్.. దుగ్గిరాల రామకృష్ణ

## ఆయన ప్రస్థానం ఓ విలువైన పాఠం..



**గార్డుగా మొదలై.. వందలాది మందికి ఉపాధి కల్పించిన దార్శనికుడు..**

**రెండు తెలుగు రాష్ట్రాల్లో వందకు పైగా సంస్థలకు సెక్యూరిటీ గార్డుల నియామకం..**

**తెలుగు రాష్ట్రాల్లో ప్రభంజనంలా తాటిపూడి యువకెరటం**

**సేవా కార్యక్రమాల్లోనూ ఆదర్శమూర్తి..**



వివరాలు తరువాయి పేజీలో





# సెక్యూరిటీ సామ్రాట్.. దుగ్గిరాల రామకృష్ణ

**యువ కెరటం దుగ్గిరాల..**

**తాటిపూడి గ్రామానికి చెందిన** దుగ్గిరాల కాటయ్య, సావిత్రి అనే నిరుపేద దంపతులకు శ్రీనివాసరావు, కొండయ్య, జ్యోతి, రామకృష్ణ అనే నలుగురు పిల్లలున్నారు. వారిలో అందరికన్నా చిన్నవాడు రామకృష్ణ. వాస్తవానికి కుటుంబంలో అందరికన్నా చిన్నవాడైనా ఆదర్శంలో మాత్రం పెద్దవాడే. తల్లిదండ్రులు గ్రామంలో బుట్టలు, తట్టలు అమ్మి కుటుంబాన్ని పోషించుకునే వాడు. చిన్ననాటి నుండే తల్లిదండ్రుల కష్టాలు, కన్నీళ్లు చూస్తూ పెరిగిన రామకృష్ణ తన కుటుంబ బాధలు పోవాలంటే తను ఏదో ఒకటి చేయాలన్న ఆశయం మనసులో పదిలంగా నింపుకున్నాడు. ఒకటి నుండి ఐదో తరగతి వరకూ తాటిపూడి ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ఆరు నుండి పదో తరగతి వరకూ వైరాలోని రవీంద్రనాథ్ ఠాగూర్ హైస్కూల్‌లో పూర్తిచేశాడు. అనంతరం 2005లో పదో తరగతి పూర్తిచేసి వైరా ఠాగూర్ కాలేజీలో ఇంటర్ మొదటి ఏడాదిలో చేరాడు. ఆర్థిక కష్టాలు తోడుగా పుస్తకాలు కొనుక్కోవడానికి, ప్రయివేటు ట్యూషన్‌కు వెళ్లేందుకు చేతిలో డబ్బుల్లేక రామకృష్ణ ఇంటర్‌లో ఫెయిల్ అయ్యాడు. కానీ నిజజీవితంలో మాత్రం తాను అనుకున్నది సాధించి తీరాలని కలలు గన్నాడు. సరిగ్గా అప్పుడే ఇక చదువుకన్నా ఏదైనా ఉద్యోగం చేయాలని నిర్ణయించాడు. పొట్ట చేతబట్టుకుని ఖమ్మం నగరానికి బయలు దేరాడు. చేతిలో చిల్లి గవ్వలేదు.. కానీ ఏదో సాధించాలన్న తపన, గుండెల నిండా ధైర్యం మాత్రం పుష్కలంగా ఉంది. ఆరోజుల్లో ఓ ప్రయివేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డు కావాలని ఓ దినపత్రికలో వచ్చిన ఉద్యోగ ప్రకటన చూశాడు. వెంటనే ఆ ఇంటర్వ్యూకు వెళ్లాడు. తనకు ఈ ఉద్యోగం ఎందుకు అవసరమో నిర్వాహకులకు వివరించి తొలి ప్రయత్నంలోనే సెక్యూరిటీ గార్డుగా నెలకు రూ. 1,700లకు విధుల్లో చేరాడు.



**నాడు సెక్యూరిటీ గార్డు.. నేడు వందలాది కుటుంబాలకు గాడ్..**

**2005లో ఖమ్మం వైరారోడ్‌లోని** ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధుల్లో చేరిన రామకృష్ణ ఇక తన అలుపెరగని ప్రస్థానానికి అంకురార్పణ గావించాడు. ఇక్కడే రెండు సంవత్సరాల పాటు పనిచేసి అందరి మన్ననలు అందుకున్నాడు. అనంతరం అతని పనితీరుకు మెచ్చుకున్న కంపెనీ నెలకు రూ. 2,800ల శాలరీ ఇచ్చి గౌరవించింది. పగలంతా ఈ పనిచేస్తూనే మరో పక్క రాత్రి వేళ కూడా ఖాళీగా ఉండకుండా గాంధీ చౌక్‌లోని ఓ బ్యాంకు ఏటీఎం వద్ద గార్డుగా నెలకు రూ. 4,500ల వేతనంతో పనిలో చేరాడు. ఇలా పగలూరాత్రి వేళ కష్టపడి పనిచేస్తూ కుటుంబ పోషణకు తాన వంతుగా అమ్మానాన్నలకు అండగా నిలిచాడు. ఇలా చేస్తూనే కరీంనగర్‌లో మెట్‌ల్కైఫ్ ఇండియా కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా చేరాడు. రాత్రంతా ఖమ్మం గాంధీచౌక్‌లో ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డుగా చేసి, తెల్లారే ఉదయాన్నే 6.30గంటలకు ట్రైన్‌లో వరంగల్‌కు వెళ్లి అక్కడి నుండి కరీంనగర్ కు బస్‌లో వెళ్తూ పగలంతా అక్కడ సెక్యూరిటీ గార్డుగా పనిచేసే వాడు. ఇలా రెండు జిల్లాల్లోనూ రోజూ వెళ్లి వస్తూ రెండు ఉద్యోగాలు చేసి అనేక కష్టాలు అనుభవించాడు. ఇలా వచ్చిన జీతంలో లక్ష రూపాయలు పొదుపు చేసుకుని 2010లో చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన రమాదేవిని వివాహం చేసుకున్నాడు. రామకృష్ణ, రమాదేవి దంపతులకు కార్తికేయ, లాస్యశ్రీ అనే ఇద్దరు చిన్నారులున్నారు.

















## కుటుంబానికి దూరంగా ఉండి పస్తులుండి.. కన్నీళ్లతో కాలం గడిపాడు..

వాహం అయిన తరువాత ఖర్చులు మరిన్ని పెగిపోయాయి. ఫలితంగా చేతిలో డబ్బుల్లేక ఇక కుటుంబానికి దూరంగా 2011లో కేసముద్రంలో నెలకు రూ.12వేలకు సెక్యూరిటీ గార్డుగా పనిలో చేరాడు. ఏడాదిపాటు అక్కడే ఉండి భార్యా పిల్లలకు దూరంగా భారంగా కాలం గడిపాడు. అప్పట్లో కేసముద్రంలో భోజనం సరిగా పడకపోవడంతో కొన్ని సార్లు మంచి నీళ్లు తాగి కన్నీళ్లతో రాత్రంగా కాళీ కడుపుతోనే గడిపేవాడు. ఆ తరువాత 2012లో ఖమ్మంలోని ఐఎన్‌జీ వైశ్యా బ్యాంకు ఏటీఎంలో 8గంటల పనికి రూ.6వేల వేతనంతో జాయిన్ అయ్యాడు. మిగతా సమయం అంతా ఆటో నడుపుతూ 2015వరకూ అష్ట కష్టాలు పడ్డాడు. అనంతరం 2016లో చెన్నై షాపింగ్ మాల్‌లో సెక్యూరిటీ ఇంచార్జ్‌గా 30మంది గార్డులను సమన్వయం చేస్తూ వారిపై ఇంచార్జీగా విధులు నిర్వర్తించడంతో తొలిసారిగా రామకృష్ణకు ఈ పోస్టులోని మజాను ఆస్వాదించాడు. నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ తనను నియమించిన కంపెనీకి, తాను పనిచేస్తున్న షాపింగ్ మాల్‌కు దగ్గరయ్యాడు.

## కష్టాలే ఆయన గెలుపు మెట్లు..

చెన్నై షాపింగ్ మాల్‌లో 30మందిపై ఇంచార్జీగా పనిచేసిన సందర్భంగా రామకృష్ణకు తాను సొంతంగా సంస్థను పెట్టాలన్న ఆశయం తలెత్తింది. ఓం శ్రీ సాయి బాలాజీ సెక్యూరిటీ సర్వీసెస్ పేరుతో 2018లో సొంతంగా సంస్థను రిజిస్ట్రేషన్ చేయించాడు. మొదటి సారిగా తన సంస్థకు వచ్చిన అవకాశంతో 14మందిని సెక్యూరిటీ గార్డులుగా నియమించి వారికి ఉపాధి కల్పించాడు. మాట తీరు, మంచితనం, నైపుణ్యం అన్నీ కలగలిపి దినదిన ప్రవర్ధమానమై ఆయన సంస్థ ముందుకెళ్లింది. ఈ క్రమంలోనే హైదారబాద్‌లోని కొలంబియా సెక్యూరిటీ సర్వీసెస్ ఎండీ ప్రభాకర్ దగ్గర మెళకువలు నేర్చుకున్నాడు. రిజిస్ట్రేషన్, జీఎస్టీ, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సాంకేతిక పరమైన వృత్తికి సంబంధించిన మెళకువలన్నీ నేర్చుకుని ఎదిగాడు. అనంతరం 2018లో ప్రారంభమైన రామకృష్ణ సంస్థ ఇప్పటికి రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు వందకు పైగా దిగ్గజ కంపెనీల్లో సుమారు 800వరకూ సెక్యూరిటీ గార్డులకు ఉపాధి కల్పించాడు. అనంతరం రామకృష్ణ నిబద్ధతకు ఐఎస్ఓ, ఎంఎస్ఎంఈ, పసారా యాక్ట లైసెన్స్, స్పెషల్ ట్రైనింగ్, సరిఫికేట్‌ను రాష్ట్ర పోలీసు విభాగంలని డీజీపీ ద్వారా ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. ఇలా ఎన్నో కష్టాలు అనుభవించిన రామకృష్ణ తన జీవితంలో అనుకున్నది సాధించి సెక్యూరిటీ గార్డులకు సామ్రాట్‌గా, యూత్‌కు ఐకాన్‌గా, కష్టాల కడలిని దాటాలంటే ఎదుర్కోవాల్సిన ఇబ్బందులను అన్నీ తన జీవితంలో చవిచూసి ఆదర్శ ప్రాయుడిగా పేరు తెచ్చుకున్నాడు. కాగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ పెద్ద పెద్ద ఈవెంట్లు జరిగినా ఆయా కీలకమైన కార్యక్రమాలకు బౌన్సర్లను అందిస్తుంటారు. పుట్టుకతోనే పరిమళించడం తెలిసిన పారిజాత పుష్పంలా లోకం తీరును ఆకళింపు చేసుకుని తాను చేపట్టిన సంస్థను విజయపథంలో నడిపే నూతన మార్గాల దార్శనికుడిలా కష్టాలు వెంటాడినా వెన్నుచూపని నైజంతో అనుభవాలే పాఠాలుగా కష్టాలే గెలుపు మెట్లుగా మార్చుకుని అనుకున్న లక్ష్యం సాధించాడు.

## కరోనా కష్టాల్లో తన వంతుగా పేదలకు సాయం..

దుగ్గిరాల రామకృష్ణ తన సంస్థ ఎదుగుదలకు ఎంత కృషి చేశారో అదే విధంగా సేవా కార్యక్రమాల్లోనూ కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలోనూ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉన్నారు. ముఖ్యంగా కరోనా కష్ట కాలంలో, నిరవధిక లాక్ డౌన్ సమయంలో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో తన వంతుగా తన సంస్థ తరఫున ఉచిత అన్నదాన కార్యక్రమాలు శానిటైజర్లు మాస్కులు పంపిణీ చేశారు. కష్టాల్లో ఉన్న పేదలు కరోనా సమయంలో పనులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి రామకృష్ణ ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు వివిధ అనాథ శరణాలయాల్లో ఉచిత అన్నదానం, ఆర్థిక సాయం, దాన ధర్మాలు చేస్తూ తను బ్రతికిందే బ్రతుకు కాదని తను వచ్చిన సమాజానికి ఎంతో కొంత చేయాలని తపనతో ముందుకెళుతున్నారు.

## ఎవరికీ విజయం ఊరికే రాదు..: దుగ్గిరాజ రామకృష్ణ (ఓం శ్రీ సాయి బాలాసీ సంస్థ అధినేత)

విజయం ఎవరికీ ఊరికే రాదు. విజయం వెనుక అనేక కష్టాలు, కన్నీ ళ్లు దాగుంటాయి. వాటిని అధిగమిస్తేనే విజయం అనేది మనకు దక్కుతుంది. సునాయాసంగా విజయం సాధించడం సాధ్యం కాదు. అందుకేద విజయాన్ని ఒడిసి పట్టాలంటే క్రమశిక్షణ, పట్టుద ల, నిబద్దత ఎంతో అవసరం. సంస్థ ఎదుగుదలకు కూడా అనేక అవాంత రాలు ఎదురవుతూ ఉంటాయి. కాలం విసిరే సవాళ్లు ఎదురొడ్డి నిలవాలి. అమ్మానాన్నల కలలు నిజం చేయాలంటే ఒక లక్ష్యం కోసం కష్టాలను చిరునవ్వుతో ఎదర్కొనాలి. అప్పుడే జీవితానికి అర్దం, పరమార్దం.

